క్లుప్తంగా

12న దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

తెర్లాం: బొబ్బిలి పట్టణంలో ఈ నెల 12వ తేదీన దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ తెలిపారు. ఇదే విషయమై శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ఉన్న దివ్యాంగులంతా ఈ శిబిరానికి విచ్చేసి, తనిఖీలు చేయించుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆలిమ్-కో-సంస్థ సహకారంతో జరిగే ఈ శిబిరంలో అవసరమైన వారికి ఉపకరణాలు అందజేయడం జరుగుతుందని, సంబంధిత ధ్రువపత్రాలతో శిబిరానికి హాజరు కావాలని కోరారు.

ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు



చినపాలవలసలో చెరువు గర్భంలో వేస్తున్న రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని చినపాలవలస గ్రామ చెరువు గర్భంలో నుంచి నడిచేందుకు వీలుగా రోడ్డు నిర్మిస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఆయన శనివారం అక్కడికి వెళ్లి, ఆక్రమణలను పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి పాల్పడుతున్న రైతులను పిలిపించి, మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తుల్లో రోడ్లు, కాలిబాటలు వేయడం చట్టరీత్యా నేరమని, వెంటనే ఇవి మానుకోవాలని లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ నిర్మాణాన్ని తక్షణమే తొలగించాలన్నారు. ఆయన వెంట వీఆర్‌ఓలు స్వప్న, నరసింహనాయుడు ఉన్నారు.

16న ఆనందో బ్రహ్మ

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో ఈ నెల 16వ తేదీన ఆనందో బ్రహ్మ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు మింది విజయ మోహనరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

శరవేగంగా విస్తరణ పనులు



రోడ్డు విస్తరణలో భాగంగా భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని గాయత్రి కాలనీ నుంచి పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ ఐటీ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పుంజుకుంది. 80 అడుగుల మేర విస్తరిస్తున్న రోడ్డులో ముందుగా చీపురుపల్లి రోడ్డుకు ఇరువైపులా కాలువ నిర్మాణం చేపడుతున్నారు. మరోవైపు అవసరమైన మేరకు కట్టడాలను అధికారులు తొలగిస్తున్నారు. ఇప్పటికే సంబంధిత యజమానులతో ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు చర్చలు జరిపారు. రోడ్డు విస్తరణకు ఎటువంటి అభ్యంతరం లేదంటూ భవన యజమానుల నుంచి విల్లింగ్ లెటర్లు తీసుకుంటున్నారు. దీంతో చీపురుపల్లి రోడ్డులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు జరిగేందుకు మార్గం సుగమం అవుతుందని పట్టణవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

70 మందిపై బైండోవర్

గజపతినగరం: ఎలాంటి లైసెన్స్ లేకుండా చిట్టీలు నిర్వహిస్తున్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని స్థానిక సీఐ ఎల్.అప్పలనాయుడు హెచ్చరించారు. గజపతినగరం మండలంలో చిట్టీలు నిర్వహిస్తున్నవారితో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా చిట్టీలు ఎత్తుబడి చేసిన వారిపై చర్యలు తప్పవని అన్నారు. అలాగే లైసెన్స్ లేని వారి వద్ద చిట్టీలు కట్టడం ప్రజలు తక్షణమే మానుకోవాలని సీఐ సూచించారు. మండలంలో అనుమతులు లేకుండా చిట్టీలు కట్టించుకుంటున్న 70మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. ఇకపైన చిట్టీల నిర్వహణ పూర్తిగా మానుకోవాలని, లేకుంటే అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తామని అన్నారు. స్థానిక ఎస్ఐ గంగరాజు పాల్గొన్నారు.

తుంపర సేద్యంతో నీటి ఆదా

గంట్యాడ: తుంపర సేద్యంతో నీటి వృథాను అరికట్టవచ్చని ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బోనంగి గ్రామంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన తుంపర సేద్యం పరికరాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తుంపర సేద్యం పరికరాలను 50 శాతం రాయితీతో అందిస్తున్నామన్నారు. తుంపర సేద్యం వల్ల మొక్క ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయండి..

బొబ్బిలి, రాజాం నియోజవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమం చూసి వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకే ఓటు వేసి, గెలిపించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



బాడంగి: ముగడ కాలనీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి



బొబ్బిలిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



రామభద్రపురం: తారాపురంలో మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు



తెర్లాం: కాగాంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ లూర్దు



వంగర: కింజంగిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొంతు వెంకటరావు



బొబ్బిలి: 14వ వార్డులో ఇంటింటికీ వెళ్లి, పథకాలు వివరిస్తున్న కౌన్సిలర్ శ్రీలక్ష్మి



మెంటాడ: పోరాంలో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



రాజాం: కంచరాంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న సర్పంచ్ సుబ్బమ్మ, తదితరులు



రేగిడి: చిన్నశిర్లాంలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

‘రన్ ఫర్ జీసస్’



ర్యాలీలో పాల్గొన్న పాస్టర్లు

బాడంగి: మండలంలోని బాడంగి, రామచంద్రాపురం, డొంకినవలస, తెంటువలస, ముగడ, పిన్నవలస, కోడూరు గ్రామాల్లో రన్ ఫర్ జీసస్ పేరిట ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పాస్టర్లంతా ఈ ర్యాలీలో పాల్గొని, ఏసుక్రీస్తు గొప్పతనం, ఆయన చేసిన బోధనలు ప్రజలకు వివరించారు. సర్వమానవాళి పాపపరిహారానికే ఆయన మానవ రూపంలో మన ముందుకు వచ్చి, శిలువ మరణం పొందారన్నారు. దయామయుడు, కరుణామయుడైన జీసస్ ఎదుటి వారి తప్పులను క్షమించి, వారిని ప్రేమించాలని తెలిపారన్నారు. కార్యక్రమంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు కె.శామ్యూల్, గౌరవాధ్యక్షుడు ఎం.చిన్నారావు, కన్వీనర్ పి.డానియేల్, కార్యదర్శి టి.రాజు, సంయుక్త కార్యదర్శి వై.జార్జ్, ట్రెజరర్ కె.డేవిడ్, సలహాదారు పి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20 లక్షలతో కాలువల నిర్మాణం

రాజాం: మండలంలో పెనుబాక గ్రామంలో శివాలయం కాలనీ వీధిలో నిర్మిస్తున్న మురుగుకాలువలను జెడ్పీటీసీ బండి నర్సింహులు శనివారం పరిశీలించారు. రూ.1.20 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామారావు వెల్లడించారు. అనంతరం ఇదే గ్రామంలో వెల్‌నెస్ సెంటర్ వద్ద రూ.6 లక్షలు అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు.

15వ ఆర్థిక సంఘ నిధులతో మురుగుకాలువలు, గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కామేశ్వరరావు ఉన్నారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

రాజాం: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రాజాంలోని పార్టీ కార్యాలయంలో కొత్తవలస గ్రామానికి చెందిన బైరి కళ్యాణికి రూ.28 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని వ్యాధులకు ప్రభుత్వమే ఉచితంగా చికిత్స అందజేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వైద్య ఖర్చులు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పొట్నూరు లక్ష్మణరావు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్లు చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, బగ్గు హరి, ఉంగటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయకుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



జెడ్పీ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

• జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: సకల విఘ్నాలను తొలగించే సంపత్ వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. నగరంలోని కొత్తపేటలో మండపం వీధిలో ఉన్న సంపత్ వినాయక ఆలయం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట ఆలయ నిర్మాణకర్త ఎడ్ల పైడిరాజు, పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు కేవీ సూర్యనారాయణరాజు, యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్ తదితరులు ఉన్నారు.

జోహార్ సైనికా

చీపురుపల్లి: కోల్‌కత్తాలో పారా గ్లెడ్డింగ్ శిక్షణలో ప్రాణాలు విడిచిన నేవీ మెరైన్ కమాండర్ చందక గోవింద్ మృతికి వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ఉపాధ్యాయుడు ఎస్.బలరాం నేతృత్వంలో చందక గోవింద్ సంతాప సభ శనివారం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. దేశ రక్షణ కోసం శిక్షణ పొందుతూ ప్రాణాలు కోల్పోయిన చందక గోవింద్ ఆదర్శప్రాయుడని కొనియాడారు.

పీహెచ్‌సీలో అధునాతన వైద్య పరికరాలు




పీహెచ్‌సీలో అధునాతన వైద్య పరికరాలు పరిశీలిస్తున్న వైద్యులు

రేగిడి: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి చందక అసిరినాయుడు అన్నారు. పీహెచ్‌సీకి రూ.10 లక్షలు విలువచేసే అధునాతన వైద్య పరికరాలను ప్రభుత్వం అందించిందన్నారు. వాటిని శనివారం నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. బీపీ, సుగర్, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, కోవిడ్ తదితర 21 రకాల వ్యాధినిర్ధారణ కిట్లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

రెండుపూటలా పని చేయాలి

రేగిడి: మండలంలో అప్పాపురం, మజ్జిరాముడుపేట, అంబఖండి, రేగిడి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, ఏపీఓ ఎస్.హరనాథరావు శనివారం పరిశీలించారు. గిట్టుబాటు వేతనం పొందేందుకు ఏ విధంగా పనులు చేపట్టాలో వేతనదారులకు అవగాహన కల్పించారు. ఎండలు పెరుగుతున్నందున ఉదయం, సాయంత్రం సమయంలో పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలిగితే ఉజ్వల భవిష్యత్



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ

వంగర: విద్యార్థినులు క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జీసీడీఓ మాలతి అన్నారు. శనివారం వంగర కేజీబీవీ విద్యాలయాన్ని తనిఖీ చేసిన ఆమె కాసేపు విద్యార్థినులతో మాట్లాడారు. విద్యాప్రమాణాలు తెలుసుకుని వాటిని మెరుగుపర్చేందుకు అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయినుల పనితీరు, విద్యార్థులకు వండిపెడుతున్న భోజనాలు, సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే ఎం.సీతారాంపురం, వంగరలో పదోతరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

శానిటేషన్ డ్రైవ్

రాజాం: పట్టణంలోని సారధి రోడ్డులో శనివారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధాన మురుగుకాలువల్లో చెత్తా చెదారంతో పాటు కాలువలకు ఆనుకుని ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ పనులను పర్యవేక్షించారు.

తహసీల్దార్ పరిశీలన



పెరుమాళి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: మండలంలోని పెరుమాళి ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు శనివారం పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న గదుల్లో బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల సౌకర్యం ఉన్నవీ, లేనివీ తనిఖీ చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని చూసి, అవసరమైనప్పుడు విద్యార్థులకు వైద్య తనిఖీలు చేసి, మందులు పంపిణీ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రతిరోజూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య, పరీక్షలు జరుగుతున్న తీరును పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పాపారావును అడిగి తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించాలని తెలిపారు.

పక్కాగా జగనన్న గోరుముద్ద పథకం అమలు



విద్యార్థులకు అందజేస్తున్న భోజనం పరిశీలిస్తున్న సర్పంచ్ రాంబాబు

తెర్లాం: విద్యార్థుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం పక్కాగా అమలు చేయాలని సర్పంచ్ శనపతి రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని రంగప్పవలస ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడ అమలు చేస్తున్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వంటకాలు చేసి, విద్యార్థులకు అందజేయాలని సూచించారు. వంటకాలన్నీ రుచి, శుచి కలిగి ఉండాలన్నారు. పాఠశాల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పెంచేందుకు కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు.

తాగునీటి పైపులైను పనులు పూర్తి చేయండి



రోడ్డు విస్తరణ పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ప్రధాన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపడుతున్న తాగునీటి పైపులైను ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు ఆదేశించారు. పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ప్రజారోగ్య శాఖ ఈఈ దక్షిణామూర్తితో కలిసి పరిశీలించిన ఆయన వీలైనంత త్వరగా పైపులైను పనులు పూర్తి చేస్తే రోడ్డు పనులు పూర్తి చేయవచ్చన్నారు. ఇప్పటికే విద్యుత్‌స్తంభాల ఏర్పాటు పనులు కూడా పూర్తయ్యాయన్నారు. అనంతరం రోడ్డు విస్తరణ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు జరగాలని సూచించారు.

మార్కెట్ ఏర్పాటు చేయాలని వినతి

రాజాం:

పట్టణంలో చేపల వ్యాపారాన్ని నమ్ముకుని 150కి పైగా మత్స్యకార కుటుంబాలు నివశిస్తున్నాయని, శాశ్వత స్థాయిలో చేపల వ్యాపారం చేసుకునేందుకు మార్కెట్‌ను ఏర్పాటుచేయాలని రాజాం మత్స్యకార సంఘం సభ్యులు ఎమ్మెల్యే కంబాల జోగులను కోరారు. రాజాంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శనివారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక యర్ర చెరువు వద్ద తాత్కాలికంగా చేపల మార్కెట్‌కు అనుమతిచ్చారని, అక్కడ షెడ్లు నిర్మించి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మత్స్యకారులు విష్ణుపాత్రుని శంకరరావు, బార తవుడు, వి.నర్సింహులు, వి.ఈశ్వరరావు, శంకర్ తదితరులు ఉన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం వృద్ధి



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం సిటీ: నవధాన్యాల సాగుతో భూసారం వృద్ధి చెందుతుందని ప్రకృతి వ్యవసాయ పీఆర్‌పీ పి.రమాదేవి అన్నారు. మండలంలోని పొగిరి గ్రామంలో ఉపాధి వేతనదారులకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల సాగుపై శనివారం అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనె గింజలు, తీగజాతి, సుగంధ ద్రవ్యాలు వంటి 30 రకాల విత్తనాలు ఎకరానికి 13 కేజీలు చల్లుకోవడం ద్వారా భూమికి కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. తద్వారా పంటల సాగుకు రసాయన ఎరువులు వినియోగించాల్సిన అవసరం ఉండదన్నారు. అలాగే నేలలో తేమ శాతం పెరగడంతో పంటలకు మేలుచేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయన్నారు. అన్ని ఆర్‌బీకేల్లో నవధాన్యాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పి.వెంకటరమణ, పి.భారతి, వై.నిర్మల పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే కనీస వేతనం

రాజాం: కొలతలు ప్రకారం పనిచేస్తేనే కనీస వేతనం లభిస్తుందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ లక్ష్మీపతిరాజు అన్నారు. మండలంలో రాజయ్యపేట గ్రామంలోని నందోడు చెరువులో చేపడుతున్న ఉపాధిపనులను శనివారం ఆయన పరిశీలించారు. మస్తర్లను తనిఖీ చేశారు. అనంతరం చేపట్టాల్సిన పనులపై వేతనదారులకు అవగాహన కల్పించారు. నిర్దేశించిన కొలతల మేరకు పనులు పూర్తి చేస్తే ప్రతిరోజు రూ.257 వేతనం పొందవచ్చన్నారు. ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఏపీఓ సాయిరాం, జేఈ నరేంద్రకుమార్, టీఏ ఆనంద్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహులు తదితరులు ఉన్నారు.

గ్రామసభలో అభ్యంతరాల సేకరణ



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

సంతకవిటి: మండలంలో జీఎస్‌పురం పంచాయతీ సచివాలయం వద్ద శనివారం సామాజిక తనిఖీల గ్రామసభ నిర్వహించారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ నిధులతో పాటు ఇతర శాఖల ద్వారా రూ.56 లక్షలతో చేపట్టిన 41 పనులకు సంబంధించి ఆడిట్ బృందాలు ఇటీవల సామాజిక తనిఖీలు నిర్వహించారు. డీఆర్‌పీ మధులత, పంచాయతీ సర్పంచ్ పప్పల ఈశ్వరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి సామాజిక తనిఖీలో గుర్తించిన వివరాలను వెల్లడించారు. వేతనదారులతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఏపీఓ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న అల్లు అర్జున్ అభిమానులు

విజయనగరం టౌన్: సినీనటుడు అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంకి ఆధ్వర్యంలో స్థానిక కాటవీధి బెస్త కాలనీ మందిరం వద్ద శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నగర మేయర్ విజయలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. అభిమాన హీరో పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో నానాజీ, రంగనాయకులు, చక్రవర్తి, ముత్యాలనాయుడు, దాసుకుమార్, రాంబాబు, రవి, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.